# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 17-03-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ఎన్నికల నియమావళి పటిష్టంగా అమలు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా అధికారులను ఆదేశించారు.
- రాష్ట్రవ్యాప్తంగా రేపటి నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి.
- ఏపీపీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ఈ రోజు రాష్ట్రంలో ప్రశాంతంగా జరిగింది.
- రాష్ట్రంలో రేపటి నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయని రాష్ట విద్యా శాఖ పేర్కొంది.

=======================

వికసిత్ భారత్ నినాదంతో జాతీయ ప్రజా స్వామ్య కూటమి దేశంలో ముందుకు సాగుతోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని చిలకలూరిపేట బొప్పూడిలో జరిగిన ప్రజాగళం బహిరంగ సభకు ముఖ్య అతిథిగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హాజరయ్యారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ, నాలుగు వందల స్థానాలలో విజయం సాధించాలన్నది బీజేపీ ఆకాంక్ష అన్నారు. దేశ అభివృద్ధి రాష్ట అభివృద్ధికి ఈ ఎన్నికలు అతి ముఖ్యమని ప్రధాని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, జనసేన అధినేత కే పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ప్రపంచం మెచ్చిన నేతగా నరేంద్ర మోదీ నిలిచారని అన్నారు. అంతకు ముందు విజయవాడ గన్నవరం విమానశ్రయం నుంచి వచ్చిన మోడీకి ఘన స్వాగతం లభించింది.

(వాయిస్ 41 సెకన్లు)

=======================

రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల నియమావళి పటిష్టంగా అమలు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన ఈ రోజు జిల్లాల వారీగా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఫ్లయింగ్ స్క్వాడ్లు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ ఈ నియమ నిబంధనలను పటిష్టంగా అమలు పర్చేలా చర్యలు తీసుకోవాల అన్నారు. రాష్ట్ర కార్యాలయానికి జిల్లా ఎన్నికల

నిర్వహణా ప్రణాళికలను పంపాలని ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. సి-విజిల్ కి అందే ఫిర్యాదులపై వంద నిమిషాల లోపు చర్యలు తీసుకోవాలని కోరారు.

=======================

రాష్ట్రవ్యాప్తంగా రేపటి నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలకు ఆరు లక్షల 23 వేల 92 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరవుతున్నారని విద్యా శాఖ అధికారులు పేర్కొన్నారు. వీరితో పాటు గతంలో పరీక్ష ఫెయిల్ అయిన దాదాపు లక్ష మంది విద్యార్థులు కూడా ఈసారి పరీక్షలు రాయనున్నారు. ఉదయం తొమ్మిదిన్నర నుంచి మధ్యాహ్నం పన్నెండున్నర వరకూ ఈ పరీక్షలు జరగనున్నాయి.

=======================

రాష్ట్రవ్యాప్తంగా ఏపీపీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ఈ రోజు ప్రశాంతంగా జరిగింది. మొత్తం 301 పరీక్ష కేంద్రాల్లో ఒక లక్షా 48 వేల 881 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. ఈ రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్–1, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పేపర్–2 పరీక్షను నిర్వహించారు. కాగా, విజయనగరం జిల్లాలో వివిధ పరీక్షా కేంద్రాల్లో ఈ రోజు నిర్వహించిన ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ఎం.దీపిక పర్యవేక్షించారు. విశాఖలో గ్రూప్-1 ప్రిలిమ్స్ ని కట్టుదిట్టంగా నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద 114 సెక్షన్ ని అమలు చేశారు.

=======================

రాష్ట్రవ్యాప్తంగా రేపటి నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయని రాష్ట విద్యా శాఖ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా తరగతుల నిర్వహణతో పాటుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజా మార్గదర్శకాలను జారీ చేసింది. అన్ని ప్రభుత్వ ప్రైవేట్ బడులలో ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు నిర్వహించాలని సూచించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఆరు బయట, చెట్ల కింద తరగతులు నిర్వహించ వద్దని ఆదేశాలు జారీ చేశారు. ఈ విద్యా సంవత్సరం ముగింపు రోజు వరకు ఇదే తరహాలో కొనసాగించాలని అధికారులు నిర్దేశించారు.

విరామం

=======================

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన నేపద్యంలో రోజువారీ నివేదికలను ప్రధాన ఎన్నికల కార్యాలయానికి అధికారులు అందించాలని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ మల్లికార్జున యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ రోజు కలెక్టరేట్ లో ఆయన ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలను జిల్లాలో కచ్చితంగా అమలు చేయాలని తెలిపారు .

=======================

మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నట్లుగా పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ చెప్పారు. భీమవరంలో కలక్టర్ ఈ రోజు మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 7 నియోజక వర్గాలకు గాను మొత్తం ఓటర్లు 14 లక్షల 61వేల 337 మంది ఉన్నారని తెలిపారు . ఇందులో మహిళా ఓటర్లు 7 లక్షల 44 వేల 308 మంది, పురుషులు 7 లక్షల 16 వేల 956 మంది ఉన్నారని వివరించారు. జిల్లాలో మొత్తం ఒక వేయి 463 పోలింగ్ కేంద్రాలలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 350లను గుర్తించామన్నారు.

=======================

బాపట్ల జిల్లా అద్దంకి సమీపంలోని జాతీయ రహదారి పై ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ ప్రాంతంలో ఎయిర్ క్రాఫ్ట్స్ ల్యాండింగ్ ట్రయల్ రన్ ను రేపు భారత వైమానిక దళం అధికారులు నిర్వహించనున్నట్లు జిల్లా SP వకుల్ జిందాల్ తెలిపారు. కొరిశపాడు మండలం పిచికల గుడిపాడు వద్ద 4.1 కిలో మీటర్ల మేర దీనిని నిర్మించారు. ఈ సందర్భంగా జిల్లా SP వకుల్ జిందాల్ మాట్లాడుతూ, ట్రయల్ రన్ జరగనున్న నేపథ్యంలో సుమారు 528 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

=======================

రాష్ట్ర ప్రభుత్వం కరవు మండలాలను ప్రకటించింది. 2023 ఖరీఫ్‌లో 448 మండలాలలో తీవ్ర వర్షాభావం ఏర్పడగా 103 కరవు మండలాలు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా 2023-24 రబీ సీజన్ కింద మరో 87 కరవు మండలాలను ప్రకటించింది. నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, ప్రకాశం జిల్లాల్లో 63 తీవ్రమైన కరవు మండలాలుగా, 24 ఒక మోస్తరు కరవు మండలాలుగా గుర్తించింది
నోటిఫై చేసే కరవు మండలాల్లో మున్సిపల్ పట్టణ ప్రాంతాలు, నీటి వనరులకు గ్యారెంటీ ఉన్న ప్రాంతాలను తొలగించి నిర్దిష్ట ప్రాంతాలను గుర్తిస్తూ కలెక్టర్లు జిల్లా గెజిట్‌లు ప్రకటిస్తారని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

=======================

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలో రాబోవు మూడు రోజులలో ఉత్తర కోస్తా జిల్లాలతో పాటు దక్షిణ కోస్తా జిల్లాలలో తేలికపాటి వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది. అదే విధంగా ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముందని పేర్కొంది .

=======================

సార్వత్రిక ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని శ్రీకాకుళం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ కోరారు. కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఈ రోజు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాజకీయ పార్టీలు వ్యవహరించాల్సిన తీరు గురించి ఈ సందర్భంగా వివరించారు.

=======================

ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తెలిపారు. వివిధ కారణాలతో ఇబ్బంది పడుతున్న కుటుంబాలకు టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డి ఈరోజు 13 లక్షల 14 వేల రూపాయలను సీఎం సహాయనిధి కింద చెక్కులు పంపిణీ చేశారు.

=======================

సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్ ఆదివారం తెలిపారు. సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న కారణంగా జిల్లా కలెక్టరేట్, డివిజన్, మండల కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

=======================

తిరుమలలో ఈ రోజు టోకెన్లు లేని భక్తులకు 18 గంటల్లో శ్రీవారి దర్శనం కలుగుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం టీటీడీ అధికారులు తెలిపారు. నిన్న స్వామివారిని 74 వేల 351 మంది భక్తులు దర్శించుకోగా భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.04 కోట్లు వచ్చిందని అధికారులు వివరించారు.

========================

విశాఖలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రం  శ్రీ సింహాచలం ఆలయంలో ఈ రోజు ఆలయ  వైదిక సిబ్బంది ఆధ్వర్యంలో శాస్త్రోక్తముగా శ్రీ స్వామివారికి 108 బంగారు సంపెంగలతో  స్వర్ణపుష్పార్చన జరిపించినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి శ్రీనివాసమూర్తి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరైనట్లుగా పేర్కొన్నారు.

========================

========================